ప్రజాశక్తి
సోమవారం 20 అక్టోబర్ 2025 5
శ్రీ సత్యసాయి



పోలీసు అమరవీరులను స్మరించుకుందాం

21 నుంచి జిల్లా వ్యాప్తంగా వారోత్సవాలు
ఎస్పీ సతీష్‌కుమార్


ఎస్పీ సతీష్‌కుమార్

ప్రజాశక్తి- కొత్తచెరువు

ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అమర వీరుల వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసులను స్మరించుకుంటూ వారి సేవలను కొనియాడుతూ వారోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసుశాఖ సిద్ధమయ్యిందన్నారు. ఇందులో భాగంగా 21న అమరవీరుల సంస్మరణ దినం, స్మతి పరేడ్, పోలీసు అమరులకు నివాళులు, శ్రద్ధాంజలి ఘటిస్తామన్నారు. పోలీసు అమర వీరుల స్థూపం వద్ద అమర వీరుల సంస్మరణ దినం జరగనుంది. 22 నుంచి 30వ తేదీ వరకు పోలీసు అమరుల గ్రామాల సందర్శన చేసి, వారి త్యాగాలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. 24 నుంచి 27 వరకు పాఠశాలలు, కళాశాలల్లో చర్చావేదికలు, వక్తత్వపు పోటీలు ఉంటాయన్నారు. 26న పోలీసుల త్యాగాలు, పరాక్రమాలు తెలియజేసే చిత్రాల ప్రదర్శనలు ఉంటాయన్నారు. 26, 27, ఓపెన్ హౌస్‌ల నిర్వహణ ఉంటుందన్నారు. ఇందులో పోలీసులు నిత్యం వినియోగించే ఆయుధాలు, సాధనాలు, పరికరాలను ప్రదర్శించి విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. 28న వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 29న పోలీసుల త్యాగాలపై సెమినార్లు, ఉపన్యాసాలు సాంస్కతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 30న పోలీసు అమరుల కుటుంబాల్లోని ప్రత్యేక సాధకులకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. 31న సమైక్యతా దినంలో భాగంగా ఉదయం యూనిట్ రన్, సాయంత్రం క్యాండిల్ ర్యాలీతో పోలీసు అమర వీరుల వారోత్సవాలు ముగుస్తాయన్నారు.. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజవంతం చేయాలని ఎస్పీ కోరారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - కొత్తచెరువు


ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందనియుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయచంద్ర రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, గౌరవాధ్యక్షులు భూతన్న విమర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారని అయితే అందులో ఎలాంటి సమస్యలను పరిష్కరించకుండా ఒక డిఎని మాత్రమే ఇస్తానని చెప్పడం న్యాయంగా లేదని అన్నారు. ఇప్పటికే నాలుగు డీఏలను చెల్లించాల్సుండగా ఒకటి మాత్రమే ఇవ్వడం ఏమిటన్నారు. ఉద్యోగులకు దాదాపు రూ. 32 వేల కోట్లు బకాయిలు ఉన్నాయని. ఇందులో పోలీసులకు సంబంధించినవి రూ. 835 కోట్ల బకాయిలు రావాలని వీరికి రూ. 105 కోట్లు మాత్రమే ఇస్తామని తెలిపారని అన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. 2023 డిఎస్సి అభ్యర్థులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని 1998, 2008 ఎం టి ఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు బాబు, సీతా మహాలక్ష్మి, శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు లక్ష్మీనారాయణ, తాహిర్‌వలి, నారాయణస్వామి, సుబ్బారెడ్డి, నరసింహప్ప, రామకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్‌లో 'రిషి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్


ప్రతిభా విద్యార్థులతో ఉపాధ్యాయులు

ధర్మవరం మండల స్పోర్ట్స్ మీట్ లో పట్టణానికి చెందిన రిషి విద్యాలయ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపర్చినట్లు ఆ పాఠశాల డీన్ భాస్కర్ , ప్రిన్సిపల్ కరణ్ స్వరూప సింగ్ తెలిపారు, ఈసందర్భంగా వారు మాట్లాడుత తమ పాఠశాలలో చదువుతోపాటు క్రీడలకు కూడా అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. సిఇఒ రవీంద్ర మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలలో రాణించేందుకు ప్రత్యేక శిక్షణ కూడా ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో రంగారెడ్డి తోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



- చిలమత్తూరు రెవెన్యూలో గందరగోళం
- ఒక్కొక్కరుగా మారుతున్న అధికారులు
- టేకులోడు భూసేకరణతో అదిరిపోతున్న అధికారులు
- అధికార పార్టీ నేతల ఒత్తిళ్లే కారణమా..?

అధికారులపై 'టేకులోడు'..!

ప్రజాశక్తి-చిలమత్తూరు

హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు రెవెన్యూ కార్యాలయంలో ఇటీవల జరుగుతున్న పరిణామాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. ప్రస్తుతం మండల పరిధిలోని టేకులోడు రెవెన్యూ పొలంలో భూ సేకరణ ప్రక్రియ జరుగుతోంది. ఇది జరుగుతున్న సమయంలో అధికారులు ఒకరి తర్వాత ఒకరు సెలవుపై వెళ్తుండడం, ఆర్ఐ, ఇద్దరు వీఆర్వోలను వేరే మండలానికి డిప్యూటేషన్ చేసే పరిణామాలు చర్చకు దారితీస్తున్నాయి. మండలంలో అధికార పార్టీ నాయకుల ఒత్తిడి తట్టుకోలేక గత తహశీల్దార్ నటరాజ్ ఆరోగ్య సమస్య పేరుతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఆ స్థానంలో హిందూపురం తహశీల్దార్ వెంకటేష్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చారు. తాజాగా రెవెన్యూ ఇన్స్పెక్టర్, టేకులోడు వీఆర్వో, మరో విఆర్వోని డిప్యూటేషన్ చేశారు. అధికార పార్టీ నాయకులు చెప్పిన పని చేయని కారణంగానే వారిని డిప్యుటేషన్ చేసినట్లు సమాచారం. ఇలా చిలమత్తూరు రెవెన్యూలో జరుగుతున్న అధికారుల స్థాన చలనంపై పెద్ద చర్చ నడుస్తోంది.

టేకులోడు వీఆర్వో మార్పు..

భూ సేకరణ జరుగుతున్న రెవెన్యూ పొలంలో అప్పటికే పని చేస్తున్న అధికారులను తొలగించరు. కొత్తవారొస్తే భూ సేకరణ మరింత ఆలస్యం అవుతుందన్న కారణంతో పాతవారితోనే ఈ పనినికానిస్తారు. అలాంటిది భూసేకరణ జరుగుతున్న టేకులోడు గ్రామ విఆర్వోను మార్చడం వెనుక ఆంతర్యం ఏమిటన్నది అంతుపట్టని విషయం. ఈ ఉద్యోగి మార్పు వెనుక అధికార పార్టీ నేతల ఒత్తిడి ఉందన్న విమర్శలు విన్పిస్తున్నాయి. కొత్త వీఆర్వోని నియమిస్తే కొత్తగా వచ్చిన ఆ అధికారి సేకరణ పనులను వేగవంతం చేస్తారా.? అన్నది మాత్రం ప్రశ్నార్థకంగానే ఉంది. ఒకవేళ పాత విఆర్వోపై ఏవైనా అవినీతి విమర్శలుంటే ఆయనపై చర్యలు తీసుకుంటారు. అలాకాకుండా డిప్యుటేషన్ వేయడం ఏమిటన్న ప్రశ్న ఉద్యోగుల్లో వ్యక్తం అవుతోంది.

ఇన్‌ఛార్జి తహశీల్దార్ పాలన


చిలమత్తూరులో డీటీగా విధులు నిర్వహిస్తున్న జగన్నాథ్ సీనియర్ ఉద్యోగి. ఈయనకు రెవెన్యూ విభాగంపై పూర్తిగా అవగాహన ఉంది. తహశీల్దార్ లేని కారణంగా ఈయనకు తహశీల్దార్‌గా అదనపు బాధ్యతలు ఇవ్వొచ్చు. అలా చేయకుండా అధికార పార్టీ నాయకులు పట్టుబట్టి ఇన్‌ఛార్జిగా హిందూపురం తహశీల్దార్‌ను తెచ్చుకున్నారు. ఆయనకు ఇన్‌ఛార్జి ఇస్తే తమ పనులు చక్కబెట్టుకోవచ్చని అధికార పార్టీ నాయకులు భావిస్తున్నారు. త్వరలో ఈయనే చిలమత్తూరు తహశీల్దార్‌గా పూర్తి బాధ్యతలు స్వీకరిస్తారని కూడా అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. ఇదే సమయంలో చిలమత్తూరు డిప్యూటీ తహశీల్దార్ జనార్ధన్‌ను డిప్యూటేషన్ చేసేందుకు చాపకింద ప్రయత్నం జరుగుతున్నట్లు సమాచారం.

ఇంతకీ ఆ నేతలు చెప్పిన పనేంటి?

వరుస డిప్యూటేషన్ల నేపథ్యంలో రెవెన్యూ అధికారులకు అధికార పార్టీ నేతలు ఏ పని చెప్పారు.? అధికారులు ఆ పని చేయడానికి ఎందుకు బయపడుతున్నారు.? అన్నది చర్చగా మారింది. టేకులోడు భూముల విషయంలో అధికార పార్టీ నాయకులకు అధికారులు సహకరించలేదన్నది ప్రాథమికంగా జరుగుతున్న చర్చ. మరి ఆ రెవెన్యూ పొలంలో సెజ్‌కు సంబంధించిన భూముల్లో అధికార పార్టీ నేతల భూములు ఉన్నాయా... లేక ఇతరుల భూములను కాజేసేందుకా..? అన్న చర్చ మండలంలో జోరుగా జరుగుతోంది.

రైతుల్లో ఆందోళన

చిలమత్తూరులో ఇన్‌ఛార్జి తహశీల్దార్ కొనసాగుతున్నారు. ఆయన అప్పుడప్పుడే కార్యాలయానికి వస్తారు. డిటి, ఆర్ఐ, వీఆర్వోలని ఒక్కొక్కరిగా డిప్యుటేషన్ చేస్తున్నారు. అధికారుల మార్పుతో మండల ప్రజలు, ముఖ్యంగా భూసేకరణ జరుగుతున్న టేకులోడు రైతులు ఆందోళన చెందుతున్నారు. భూ సేకరణ జాబితాలో భూమి ఉండి, వివిధ కారణాలతో ఇంకా నష్ట పరిహారం అందని రైతులు పాసు పుస్తకాలు పట్టుకుని తహశీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరికొందరు పాసు పుస్తకాలు లేక డీ పట్టాలను వీఆర్వోకు ఇచ్చారు. రైతులకు సమాచారం ఇచ్చే అధికారి లేక వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ సమయంలో సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మండలంలో అధికారుల మార్పు వ్యవహారంలో జరుగుతున్న పరిణామాలను బహిర్గతం చేసి రైతుల్లో నెలకొన్న ఆందోళనలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.





ఇదెక్కడి న్యాయం..?


నేలమట్టమైన చెట్టు

ప్రజాశక్తి - పరిగి

కంచె చేనును మేసినట్లు ఉంది ఫారెస్ట్ అధికారుల పరిస్థితి. అడవులను కాపాడాల్సిన అధికారులే చెట్లు నరికివేత దారులకు మద్దతిస్తూ సొమ్ము చేసుకుంటున్న పరిస్థితి పరిగి మండలంలో చోటు చేసుకుంది. అందుకు సంబంధించిన వివరాల్లోకెళితే మండలంలోని కాలువపల్లి వద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం 9 ఎకరాల స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కొన్నారు. అయితే ఈ భూమిలో సుమారు 15 ఏళ్లుగా పెంచిన చింత, వేప చెట్లు 30కి పైగా ఉన్నాయి.అయితే ఈ భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ప్లాట్లు వేసేందుకు చెట్లు అడ్డంగా ఉండటంతో వాటి తొలగింపునకు వ్యాపారులు సిద్ధమయ్యారు. అందులో భాగంగా చెట్ల తొలగింపునకు తహశీల్దార్ అనుమతి కోరారు. భూమిని పరిశీలించిన తహశీల్దార్ అటవీ శాఖ అధికారులకు సిఫార్సు చేశారు. దీంతో అటవీశాఖ15 ఏళ్ల నాటి చింత, వేప, కానుగ చెట్లు నరికి వేసేందుకు ఒక్కో చెట్టుకు 50 రూపాయలు మాత్రమే రుసుము తీసుకుని ఎస్ ఎన్ సునంద పేరు మీద అనుమతులు ఇచ్చారు. అయితే ఒక చెట్టు నరకాలంటే ఎన్నో కారణాలు చెప్పే అటవీశాఖ అధికారులు 15 ఏళ్ల నుండి ఉన్న చెట్ల నరికివేతకు రూ. 1350 లకే ఎలా అనుమతి ఇస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంలో ఫారెస్ట్ అధికారుల హస్తం ఏమేరకు ఉంది, ఎంత నగదు చేతులు మారింది అన్నది తేలాల్సుందని వారు వ్యాఖ్యానిస్తున్నారు. ఒక చెట్టును నరికితే లక్ష రూపాయలు విధించాలని ఇటీవల సుప్రీంకోర్టు సైతం తీర్పులిస్తున్నా అలాంటివి క్షేత్రస్థాయిలో అమలు కాకపోవడం చూస్తే సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం అటవీ శాఖ అధికారులు పాటించడం లేదని తెలుస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. అంతేకాకుండా ఓ సగటు వ్యక్తి చింత చెట్టు కానీ వేపచెట్టు కానీ నరికితే ఎంతో హడావిడి చేసే ఫారెస్ట్ అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు వత్తాసు పలకడం విడ్డూరంగా ఉంది. తాము ప్రకృతి సంరక్షకులు అని, చెట్లు నరికి వేస్తే అధికారుల అంతు చూస్తాం అంటున్న కొంతమంది చెట్ల సంరక్షకులు ఒక సామాజిక వర్గానికి చెందిన వారికి వత్తాసు పలకడం ప్రత్యక్షంగా కనిపిస్తోందని స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మండలంలో వాల్టాచట్టం కూడా అమలులో ఉండటం గమనార్హం. అయితే ఎంతమంది అధికారులు ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారుల ద్వారా లబ్ధి పొంది, పర్యావరణ పరిరక్షణ నష్టానికి పూనుకున్నారన్నది ఉన్నతాధికారులు విచారణలో తేలాల్సుంది.

పేలుతున్న టపాసుల ధరలు


నిబంధనలు పాటించకుండా ఏర్పాటు చేసిన దుకాణాలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరులో టపాసులు ధరలు పేలుతున్నాయి. అగ్గిపెట్టె నుంచి థౌజండ్ వాలా వరకు ధరలు పేలుతున్నాయి. ఈ ధరలు చూసి ప్రజలు బిత్తరపోతున్నారు. టపాసుల దుకాణాదారులను నిబంధనలు గాలికొదిలేశారు. అధికారులు అధికారానికి తలొగ్గి.. నిబంధనలను కాలరాశారు. దీంతో చిలమత్తూరు మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం పెట్టిన టపాసుల షాపు ప్రమాదకరంగా ఉంది. ఇక భద్రతా నిబంధనల అమలును పరిశీలిస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ప్రభుత్వం స్పష్టంగా టపాసుల దుకాణాలు ప్రతి షాపులో అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా ఉండాలని, ఒకే దుకాణంలో యాభై కిలోలకంటే ఎక్కువ టపాసులు నిల్వ చేయరాదని, రెవెన్యూ, అగ్నిమాపక శాఖల అనుమతులు తప్పనిసరిగా ఉండాలని చెబుతోంది. అయితే చిలమత్తూరు మార్కెట్ యార్డ్‌లో ఒక్క నియమం కూడా అమలు కావడం లేదు. పలు టపాసుల షాపులు పక్కపక్కనే ఏర్పాటు చేసి, ఎటువంటి అగ్నిమాపక పరికరాలు లేకుండా ప్రమాదకర పరిస్థితుల్లో వ్యాపారం కొనసాగిస్తున్నారు. రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారుల ముందే ఇదంతా జరుగుతున్నా వారు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. నిబంధనలు ఉల్లంఘించి ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్న వ్యాపారులపై అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

లైసెన్స్‌లు లేవు.. పన్ను చెల్లింపూ లేదు.!

టపాసుల విక్రయాల్లో అడ్డదారులు -ప్రజాశక్తి కథనంతో అధికారుల్లో చలనం

ప్రజాశక్తి-కదిరి టౌన్

దీపావళి పండుగ సందర్భంగా కదిరి పట్టణంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలకు సంబంధించి లైసెన్సులు లేవు. పన్ను చెల్లింపు లేదు. ఈ విషయం స్వయంగా అధికారుల తనిఖీల్లో బయటపడింది. ఇదే విషయంపై ఆదివారం ప్రజాశక్తిలో 'దీపావళి వెలుగుల మాటున చీకటి వ్యాపారం' అన్న శీర్షిక ప్రజాశక్తిలో కథనం ప్రచురితం అయ్యింది. ఈ కథనంతో అధికారుల్లో చలనం వచ్చింది. ఆర్డీవో, డీఎస్పీ పన్నుల శాఖ అధికారులు ఆదివారం సాయంత్రం మూకుమ్మడిగా తనిఖీలు నిర్వహించగా దుకాణదారుల చీకటి వ్యాపారం బహిర్గతం అయ్యింది. టపాసుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసే సమయంలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులపై ఆర్డీవో ఆరా తీశారు. కాగా సోమవారం నాడు పన్నులను చెల్లిస్తామంటూ వ్యాపారులు అధికారులకు తెలిపినట్లు సమాచారం. కోట్లలో వ్యాపారం జరగ్గా కనీసం వేలల్లో కూడా పన్నులు చెలించలేదని సమచారం. అధికారుల తనిఖీల అనంతరం కూడా వ్యాపారులు నిబంధనలు పాటించకుండానే అమ్మకాలు చేస్తున్నారు. అధిక ధరలకు టాపాసులను విక్రయిస్తూ ప్రజలకు మాత్రం బిల్లులను ఇవ్వడం లేదు. అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు టపాసులను విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులకు విద్యుత్ కష్టాలు రానివ్వం : మంత్రి


రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు అందజేస్తున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

రైతు పక్షపాతి ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని తమ ప్రభుత్వ హయాంలో రైతలకు కరెంట్ కష్టాలు రానియ్యమని మంత్రి సవిత అన్నారు. ఆదివారం పట్టణంలోని ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో పెనుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా మంజూరైన 75 మంది రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లను ట్రాన్స్‌కో ఎస్ఈ సంపత్ కుమార్‌తో కలిసి మంత్రి రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర లోనే నియోజకవర్గ వ్యాప్తంగా 475 ట్రాన్స్‌ఫార్మర్లు రైతుకు అందజేశామన్నారు. త్వరలో మరిన్ని అందజేస్తామన్నారు. వ్యవసాయంలో రైతులకు కరెంటు కష్టాలు లేకుండా చూడాల్సిన బాధ్యత విద్యుత్ శాఖ అధికారులపై ఉందన్నారు. గత కొన్ని రోజులుగా ట్రాన్స్ ఫార్మర్ల కోసం నిరీక్షిస్తున్న రైతులకు విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి మంజూరు చేశామన్నారు. రైతు కష్టాలు తెలిసిన వ్యక్తి చంద్రబాబు నాయుడన్నారు. విద్యుత్ పరికరాలు అవసరమైన వాటిని సకాలంలో అందించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నివారించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే రెండు సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేశామని, త్వరలో మరో మూడు సబ్‌స్టేషన్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తామని అన్నారు. నిరుద్యోగ నిర్మూలనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ సబ్సీడీ సోలార్ రూఫ్ టాప్ ను ఉపయోగించుకుని పర్యావరణాన్ని కాపాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప్పర కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, యాదవ,కురుబ కార్పొరేషన్ డైరెక్టర్లు కేశవయ్య, శ్రీనివాసులు, సింగిల్ విండో అధ్యక్షులు పోతిరెడ్డి, నారాయణస్వామి, పట్టణ, మండల కన్వీనర్లు శ్రీరాములు, ఈశ్వర ప్రసాద్, తివేంద్ర, షమీ, కృష్ణమూర్తి, షౌకత్, సోమశేఖర్, ఎనుముల రామకృష్ణ, విద్యుత్ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో రైతులకు ఉపయోగం

జిల్లా భూమి రికార్డుల ఏడీ విజయశాంతి


జిఎస్.విజయశాంతి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

'ప్రభుత్వం చేపట్టిన భూముల సర్వే వల్ల రైతులకు ఎంతో ఉపయోగం చేకూరుతుంది. రీ సర్వే రైతులకు ఉపయోగకరమైనందున ప్రస్తుత కూటమి ప్రభుత్వం పారదర్శకంగా దీనిని అమలు చేస్తోంది. అన్నదమ్ముల మధ్య భూ వివాదాలు, ఆక్రమణలు, సాగు ఒకరు.. భూ రికార్డుల్లో మరొకరు తదితర సమస్యలన్నీ రీ సర్వేతో పరిష్కారం అవుతాయి' అని జిల్లా సర్వే శాఖ ఏడీ విజయశాంతి పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో రీ సర్వే పనులు చేపడుతున్న చర్యలపై ప్రజాశక్తికి ముఖాముఖిలో పలు అంశాలను తెలియజేశారు.

ప్రశ్న : జిల్లాలో భూ విస్తరణం ఎంత.? గతంలో ఎన్ని ఎకరాలు, ఎన్ని గ్రామాల్లో సర్వే చేపట్టారు.?

ఎడి : జిల్లాలో మొత్తం 20,91,976.25 ఎకరాల భూమి ఉంది. 32 మండలాల్లో మొత్తం 461 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. గతంలో 161 గ్రామాల్లో 4,02,857.9 ఎకరాలు రీ సర్వే జరిగింది. మొదటి విడతలు జిల్లాల 32 గ్రామాలు రెండో విడతలు 23 గ్రామంలో మొత్తం సర్వే పూర్తయింది. మూడవ విడత ఒక గ్రామంలో రీ సర్వే జరుగుతోంది. మొత్తం 1.06 లక్షల ఎకరాల్లో సర్వే జరుగుతోంది. గతంలో రెండు విడతలో రీ సర్వే జరిగిన భూముల్లో సర్వే రాళ్లు పాతడం పొజిషన్ ధ్రువీకరణ పత్రాలు అందిస్తారు.



ప్రశ్న:సర్వేలో ఏఏ అధికారులు పాల్గొంటారు.? వాటి వివరాలు ఏమిటి.?

ఎడి: రీ సర్వేలో ప్రధానంగా సచివాలయంలోని గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు, డిప్యూటీ తహశీల్దార్లు మండల సర్వేయర్లు పాల్గొంటారు. జిల్లాలో మొత్తం 355 మంది గ్రామ సర్వేయర్లు ఉన్నారు. వీరంతా రీ సర్వేలో కీలకంగా ఉంటారు. మొదట విలేజీ బౌండరీ తర్వాత ఆయా గ్రామాల రెవెన్యూ పొలంకు సంబంధించిన రికార్డులు ఆయా రైతుల పట్టాదారు పుస్తకాలు ఆధారంగా సర్వే ప్రారంభించడం జరుగుతుంది.

ప్రశ్న- రైతుల మధ్య భూ తగాదాలను ఎలా పరిష్కరిస్తారు.?

ఎడి:ప్రధానంగా అన్నదమ్ముల భూమి తగాదాలు, సాగులో ఒకరు ఉంటే రికార్డులో మరొకరు ఉంటారు. భూ అక్రమణాల సమస్యలూ ఉంటాయి. కోర్టు కేసుల్లోనూ భూ సమస్యలుంటాయి. ఇలాంటి వాటి అన్నింటినీ రీ సర్వేద్వారా పరిష్కరించేందుకు వీలుకలుగుతుంది. సమస్య ఉన్న ఇద్దరి సమక్షంలో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయడం ద్వారా భూ వివాదంకు ముగింపు పలికే అవకాశం ఉంటుంది.

ప్రశ్న : భూ సమస్యలు రీ సర్వేతో పరిష్కారం అవుతాయా.?

ఎడి : బ్రిటిష్ పాలనలో చేసిన సర్వే ఆధారంతోనే ఇప్పటివరకు భూ రికార్డులు న్నాయి. ఎంతో మంది రైతులు భూ వివాదాల సమస్య లతో సతమతం అవుతున్నారు. ఈ నేప థ్యంలో ప్రభుత్వం పూర్తిగా భూ ప్రక్షాళనకు రీ సర్వే ద్వారా పరిష్కారం చూపించే ఏర్పాటు చేసింది. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న 1.06 లక్షల ఎకరాల భూ సర్వే డిసెంబర్ 16కు పూర్తి చేయలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. సర్వే అనంతరం ఆయా రైతుల భూములకు హద్దులు చూపించడం, రాళ్లు పాతడం వివాదాలు ఏమీ లేకుండా ఆ రైతులకు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం జరుగుతుంది.

ప్రశ్న : మీ శాఖలో సిబ్బంది కొరత ఉందా.? రీసర్వేపై రైతులకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటి.?

ఎడి : తమ శాఖలో సిబ్బంది కొరత ఏమీ లేదు. ఉన్న సిబ్బందితోనే పగడ్బందీగా రీ సర్వే చేపడుతున్నాం. సర్వే చేసే సమయంలో సర్వే రెవెన్యూ సిబ్బందికి ఆయా గ్రామాల్లో రైతులు ప్రజలు సహకరించాలని కోరుతున్నాం. ప్రజల ముంగిటకే ప్రభుత్వ యంత్రాంగం కదిలి వచ్చి రైతుల భూ సమస్యల పరిష్కరించడానికి వస్తున్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

ప్రజాశక్తి www.prajasakti.com

నాయకుని చెంత కార్మికుని 'పట్టా'..!

కదిరి పట్టణ పరిధిలో ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు కేటాయించిన పట్టాలను ఓ నాయకుడు తన వద్దనే ఉంచుకున్నారు. నాయకుని ముసుగులో పట్టాలను ఏళ్లతరబడి తన వద్దనే ఉంచుకుని కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇందులో కొన్ని పట్టాలను పేరు మార్చి అమ్మేసే లక్షలాది రూపాయలను సదరు నాయకుడు సొమ్ము చేసుకున్నాడు. అక్రమార్కుడి చెరలో పట్టాలను తమకు ఇప్పించాలని కార్మికులు తహశీల్దార్ మొదలుకుని జిల్లా కలెక్టర్ వరకు ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా న్యాయం జరగడం లేదు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన కొత్త కలెక్టర్ అయినా తమగోడు పట్టించుకోవాలంటూ బాధితులు గంపెడాశతో ఎదురు చూస్తున్నారు.

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరిలో భవన నిర్మాణ రంగానికి చెందిన కార్మికులు వారి సమస్యలపై చర్చించేందుకు, హక్కులను సాధించుకునేందుకు సంఘం ఏర్పాటు చేసుకున్నారు. 2002 సంవత్సరంలో కొందరు నాయకుల సహకారంతో రిజిస్టర్ నెంబర్ 1949పై కదిరి భవన నిర్మాణ కార్మిక సంఘం ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం కార్మికులకు సంబంధించి అంజనేయ స్వామి గుడి వెనుక స్థలం ఉన్నట్లు సమాచారం. దీంతో ఆ స్థలాన్ని ప్రయివేటు వ్యక్తులకు విక్రయించగా వచ్చిన నగదుతో 2007 సంవత్సరంలో హిందూపూర్ రోడ్డులో ప్రయివేటు వ్యక్తులకు సంబంధించిన 1713 -2 లో 3.10 సెంట్లు, 1769, 1770 సర్వే నెంబర్లలో భూమిని సంఘం తరపున తీసుకున్నారు. ఆ భూమికి చెందిన యజమానులు కార్మికుల కోసం దీనిని ఉదారంగా ఇచ్చారు. ఆ స్థలం భవన నిర్మాణ కార్మిక సంఘం పేరు మీద డాక్యుమెంట్ నెంబర్ 1175తో శాశ్వత అగ్రిమెంట్ చేయించి ఇచ్చారు. వారి పేరుపై ఉన్న పట్టాను రద్దు చేసి ఆ భూమిలో కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించి 2007 సంవత్సరంలో హెచ్ఎస్ఆర్ఐఎస్ ఫైలు నెంబర్ 35/1417 పేరుతో 323 మంది భవన నిర్మాణ కార్మికులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. పట్టాలు రావడంతో తమ సొంతింటి కల సాకారం అవుతుందని కార్మికులు భావించారు.

నాయకుని ముసుగులో దగా

యూనియన్ ఏర్పాటు సమయంలో ఓ నాయకుడు కార్మికులతో చేరారు. సమస్యల పరిష్కారానికి తాను అండగా ఉంటానని కార్మికులను నమ్మించాడు. తర్వాత కాలంలో ఆయన నిజస్వరూపం బయటపడింది. కోట్ల రూపాయల విలువజేసే కార్మికుల ఇళ్ల స్థలాలపై కన్నేశాడు. 1713 సర్వేనెంబర్‌లో కార్మికుల సౌకర్యార్థం కమ్యూనిటీ హాలు నిర్మిద్దామని, మిగతా 1769, 1770 సర్వేనెంబర్‌లోని భూమిలో లాటరీ పద్ధతిలో స్థలాలు కేటాయిద్దామని నమ్మబలికాడు. అప్పట్లోనే కొందరి దగ్గర డబ్బులు తీసుకుని పట్టాలు ఇచ్చినట్లు సదరు నాయకునిపై ఆరోపణలు ఉన్నాయి. కార్మికుల పేరుపై అధికారులు పట్టాలిచ్చినా అవి వారి చెంతకు చేరలేదు. దశాబ్దాల కాలం గడిచినా ఆ స్థలంలో ఇప్పటికీ ఒక్క కార్మికుడు కూడా ఇంటి నిర్మాణం చేపట్టలేదు. పట్ట ఉన్నవారెవరైనా ఇంటి నిర్మాణం చేపట్టడానికి వెళ్తే సదురు నేత అనుచరులు అడ్డంకులు సృష్టిస్తున్నారు.

వసూళ్ల పర్వం

భవన నిర్మాణ సంఘానికి అప్పట్లో అధ్యక్షుడుగా కొనసాగిన నాయకుడు తర్వాత ఆ యూనియన్ నుంచి బయటకు వచ్చేశారు. సంఘం నుంచి బయటకు వచ్చినా ఆ భూమిపై పెత్తనం మాత్రం ఇప్పటికీ చెలాయిస్తూనే ఉన్నారు. ఆ భూమికి సంబంధించిన గత స్కెచ్ ప్రకారం ప్రభుత్వం 323 కార్మికులకు పట్టాలు మంజూరు చేసింది. అందులో నకిలీ స్కెచ్ సృష్టించి 500 వరకు పట్టాలు ఇచ్చినట్లు చూపిస్తూ వసూళ్ల పర్వానికి తెరలేపారని కార్మికులు చెబుతున్నారు. పట్టాలు పొందిన అర్హులైన కార్మికులను అటు వైపు రానీయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు బాధితులు వాపోతున్నారు. ఈ సర్వే నెంబర్ పక్కనే ఉన్న గుట్టను సైతం ఆక్రమించి కొందరికి పట్టాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

ఫిర్యాదులు చేసినా దక్కని న్యాయం

కదిరి పట్టణ భవన నిర్మాణ కార్మికులు తమకి జరుగుతున్న అన్యాయంపై ఇప్పటి వరకు తహశీల్దార్ మొదలుకునికలెక్టర్ వరకు పలుమార్లు వినతులు అందించారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. విచారణ చేసి న్యాయం చేస్తామని అధికారులు చెప్పడంతోనే కాలం సరిపోతోంది. సదరు నేత కార్మికుల పట్టాలను తన వద్ద ఉంచుకుని అక్రమాలకు పాల్పడుతున్నారని అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటన్నది అంతుబట్టడం లేదు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ చొరవ చూపించి తమ పట్టాలు తమకు ఇప్పించి న్యాయం చేయాలని భవన నిర్మాణ కార్మికులు కోరుతున్నారు.

ఏళ్ల తరబడి అక్రమార్కుడి చెరలో ఇళ్ల పట్టాలు
రూ.కోట్లు విలువజేసే భూమి హస్తగతానికి కుట్ర
కదిరిలో అపరిష్కృతంగా భవన నిర్మాణ కార్మికుల స్థలాల సమస్య
అధికారుల నుంచి కొరవడిన సహకారం
నూతన కలెక్టర్‌పై కార్మికుల ఆశలు



భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన స్థలంలో వేసుకున్న పునాదులు

న్యాయం కోసం ఎదురుచూస్తున్నాం..



తమ ఇళ్ల స్థలాల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నాం. న్యాయం చేయాలని అధికారులకు అనేకసార్లు విన్నవించాం. అక్రమాలు చోటు చేసుకున్నట్లు విచారణలో తేలినా అక్రమార్కుడిపై చర్యలు తీసుకోవడంలేదు. అధికారులు స్పందించి తమ పట్టాలు తమకు ఇప్పించి న్యాయం చేయాలి.

వలి,
భవన నిర్మాణ కార్మికుడు.

కలెక్టర్ స్పందించాలి



కదిరి పట్టణం హిందూపూర్ రోడ్డులో సర్వే నెంబర్ 1769, 1770లో చోటు చేసుకున్న అవినీతి బాగోతంపై గత కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. అయినా ఫలితం కనిపించలేదు. ప్రస్తుత జిల్లా కలెక్టర్‌కు ప్రజా సమస్యల ఫిర్యాదు వేదికలో వినతిపత్రం అందజేశాం. నూతన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ స్పందించి బాధిత కార్మికులకు న్యాయం జరిగేలా చొరవ చూపాలి.

బాబా ఫక్రోద్దీన్,
భవన నిర్మాణ కార్మికుడు.

హత్య కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఆస్తి కోసం కన్న కొడుకే తల్లిని హత్య చేసిన ఘటనలో నిందితులను అరెస్ట్ చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 12న కదిరి టౌన్ నిజాంవలి కాలనీ, జెండామాను వీధిలో నివాసం ఉంటున్న షేక్ కాసింబీ అలియాస్ షాదాదీ (65) ను ఆమె కొడుకు అల్లా బకాష్ ఆలియాస్ బాబా ఫక్రుద్దీన్ తన రెండవ భార్య షేక్ రసూల్ బితో కలిసి కట్టె, కత్తితో ఆమెను హత్య చేశారని ఆమె వద్ద ఉన్న డబ్బులు, బంగారు ఆభరణాలు, ఇంటి పత్రాలను తీసుకొని పారిపోయారని మతురాలు కూతురు షేక్ అమ్మాజాన్ ఫిర్యాదు చేసిందని సిఐ చెప్పారు. ఆమె ఫిర్యాదు మేరకు 13న కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామన్నారు. ఈ నేపథ్యంలో కదిరి కుటాగుల రైల్వే గేట్ వద్ద మతురాలి కొడుకు షేక్ అల్లాబకాస్ అలియాస్ బాబా ఫక్రుద్దీన్, అతని రెండవ భార్య షేక్ రసూల్ ఉండగా అరెస్టు చేసినట్లు చెప్పారు. డబ్బులు, నగలు ఆస్తి కోసమే హత్య చేసినట్లు తమ దర్యాప్తులో వెల్లడైందని సిఐ చెప్పారు. నిందితులను ధర్మవరం కోర్టు ముందు హాజరుపరచగా కోర్టు 14 రోజులు రిమాండ్ విధించడంతో అనంతపురం జైలుకు తరలించామని సిఐ వివరించారు.

గుండెపోటుతో అర్చకుడు మృతి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల ఎర్రబల్ల విజయ్ కుమార్ శర్మ(51) అనే అర్చకుడు ఆదివారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఎర్రబల్ల విజయ్ కుమార్ శర్మ ఎస్ ఎల్ వి మార్కెట్ వద్ద గల సుబ్రహ్మణ్యేశ్వర కట్ట ఆలయంలోనూ, చెరువు కట్ట వద్ద గల వినాయక ఆలయంలోనూ అర్చకునిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. విజయ్ కుమార్ శర్మ మృతి చెందడం తీరని లోటు అని బ్రాహ్మణులు, గాయత్రి సంఘము, అర్చక సంక్షేమ సంఘం నాయకులు అన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - గుడిబండ

మండల పరిధిలోని రాళ్లపల్లికి చెందిన రంగప్ప అనే వ్యక్తి 15 రోజుల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మైనగానపల్లి గ్రామానికి చెందిన జ్ఞాన రుక్ష చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు వరప్రసాద్ మృతుని కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. మృతుని భార్యకు రూ.3వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి

ప్రజాశక్తి - కొత్తచెరువు

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని అప్‌గ్రేడ్ సిఐ మారుతి శంకర్, తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఆదివారం ఉదయం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చి పలు విషయాలపై అవగాహన కల్పించారు. గొడవలకు గాని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బత్తలపల్లి : పోలీస్ రికార్డులకెక్కిన రౌడీ షీటర్లు, అనుమానితులు పోక్సో కేసులలోని నిందితులు, పాత కేసులలో నిందితులు సత్ప్రవర్తనతో జీవించాలని ఎస్ఐ సోమశేఖర్ సూచించారు. ఆదివారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని పోలీస్ స్టేషన్లో మండలంలోని పలు గ్రామాలకు చెందిన నిందితులకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. వివిధ నేరాలలో పాల్గొన్న నిందితులను ప్రతి ఆదివారం పోలీస్ స్టేషన్ పిలిపించి వారి కదలికలు నడవడికపై కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. పోలీస్ రికార్డులలో పేర్లు తొలగించేటంతవరకు ఎలాంటి నేరాలకు పాల్పడకూడదన్నారు. నిందితులందరితో తాము ఎలాంటి నేరాలు చేయమని అంగీకార పత్రం తీసుకున్నారు.

నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

దీపావళిసందర్భంగా ఏర్పాటుచేసిన క్రాకర్స్ షాపుల యజమానులు పోలీసులు నిబంధనలు పాటించి విక్రయాలు చేయాలని అలా ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్ హెచ్చరించారు. ఆదివారం ధర్మవరం డిఎస్పి హేమంత్ కుమార్ తన సిబ్బందితో క్రాకర్స్ ఏర్పాటుచేసిన ప్రాంతాన్ని అక్కడ తీసుకుంటున్న ఏర్పాట్లను పరిశీలించారు. నియమాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - బత్తలపల్లి

రెండు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందిన వైసిపి కార్యకర్త చంద్రగిరి లోకానాథరెడ్డి కుటుంబాన్ని ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పరామర్శించారు. ఆదివారం గ్రామానికి చేరుకున్న ఆయన బాధితులను పరామర్శించారు. అదేవిధంగా వైఎస్సార్సీపీ నాయకుడు గుర్రం నరసింహరెడ్డి ఇంటికి చేరుకుని ఆయన ఆరోగ్యంగా గురించి ఆరా తీశారు. ఆనంతరం గుర్రం పరమేశ్వరరెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయనను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమతం ఈశ్వరయ్య, గుర్రం శ్రీనివాసరెడ్డి, కోటి సురేష్, షరాబ్ యోగానంద ఆచారీ, సాకే సురేష్, మినమనూరి లోకేష్, బిల్లే సూరీ, బొంతల నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సిఎం స్పందన హర్షణీయం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఉద్యోగుల డిమాండ్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందన హర్షణీయమనిఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు లింగా రామ్మోహన్ పేర్కొన్నారు. ఆదివారం ఆ సంఘం నాయకులతో కలిసి మాట్లాడుతూ దీపావళి కానుకగా నవంబర్ నెలలో డి ఏ ను విడుదల చేయడం, జిల్లా హెల్త్ కార్డులు మంజూరుకు కమిటీని ఆదేశించడం ఆర్టీసీ ఉద్యోగుల ఉద్యోగోన్నతిపై వారం రోజుల్లో ఉత్తర్వులు జారీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలు ఇంకా చాలా ఉన్నాయని వాటిని కూడా పరిష్కరించాలని కోరారు..

అవార్డు గ్రహీతలకు సన్మానం

ప్రజాశక్తి - కొత్తచెరువు

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన మాణిక్యం ఇసాక్ ,కేశవ నాయుడును ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆసంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు పివీ మాధవ్, ఏపీ టిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్ కుమార్ తదితరులు అవార్డు గ్రహీలతను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయి శివ, చంద్ర ,భాస్కర్ నాయుడు, హరి, తదితరులు పాల్గొన్నారు.

బూదిలిలో వాల్మీకి విగ్రహం ఏర్పాటు

ప్రజాశక్తి - గోరంట్ల

మండలంలోని బూదిలి గ్రామంలో ఆదివారం వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహ ప్రతిష్టకు మండలంలోని వాల్మీకి సోదరులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాలసముద్రం సింగల్ విండో అధ్యక్షులు బెల్లాలచెరువు చంద్ర, టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, సర్పం సర్పంచ్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో దీపావళి వేడుకలు

ప్రజాశక్తి- హిందూపురం

పట్టణంలోని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరయ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో దీపావళి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. తొలుత మున్సిపల్ చైర్మన్ తో పాటు బ్రహ్మకుమారీలు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బెహన్ సుగంధ, బ్రహ్మకుమారి కమల, కౌన్సిలర్ అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

లింగారెడ్డిపల్లిలో గ్రామోత్సవం

ప్రజాశక్తి బత్తలపల్లి

మండలంలోని లింగారెడ్డిపల్లిలో శనివారం రాత్రి బొంతల వంశస్తుల ఆధ్వర్యంలో కొడిమి కల్లమడప్పస్వామి, మరూరు వసికేరప్పస్వామి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామోత్సవం పెద్దపెద్ద డ్రమ్ముల మోతలతో ఆకర్షణీయంగా సాగింది. స్వామి పూజార్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మాలగుండ్ల శంకరనారాయణ, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి. వైఎస్సార్సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గసభ్యులు కమతం ఈశ్వరయ్య, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్, నియోజకవర్గ కల్చరల్ వింగ్ అధ్యక్షులు యోగానంద ఆచారీ, వైసిపి నాయకులు గుర్రం నరసింహారెడ్డి, బిల్లే సూరీ, వెంకటనారాయణ, పూజారి కల్లమడప్ప, పూజారి మహేష్‌తోపాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు. గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

ప్రజాశక్తి - కొత్తచెరువు రూరల్

కాలుష్య నివారణకు ప్రతిఒక్కరూ మొక్కలను నాటి ప్రకృతిని సంరంక్షించాలని పర్యావరణవేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన కొత్త చెరువులోని టపాసులు దుకాణాల వద్దకు వెళ్లిటపాసులు కాల్చడం వల్ల కలిగే కాలుష్యం గురించి వివరించారు. టపాసులు కొన్న ప్రతి వ్యక్తికి ఒక మొక్కను ఇచ్చి నాటమని కోరుతున్నాడు. ఈ కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కల్చర్ అండ్ నేచర్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ స్టేట్ యూత్ ప్రెసిడెంట్ నితీష్ చౌదరి, హేమాద్రి ,ప్రవీణ్, మహేష్, రాకేష్, దినేష్, పవన్, భాను ప్రకాష్, భరత్, గణేష్ ,బాలాజీ, పార్థసారథి. సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండలో అన్నదానం

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పట్టణంలోని అయ్యప్ప స్వామి గుడి ఆవరణంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కొండాపురం శ్రీనివాసులు అమ్మ లక్ష్మీనరసమ్మ జ్ఞాపకార్థం మార్కెట్‌కు వచ్చిన గ్రామీణ ప్రాంత ప్రజలకు నారాయణ సేవలో భాగంగా శ్రీసత్య సాయి సేవ సమితి కన్వీనర్ శంకరప్ప ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

డాక్టర్ రవీందర్ రెడ్డికి నివాళి

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఈనెల 12న మృతి చెందిన డాక్టర్ రవీంద్ర రెడ్డికి కదిరి ఐఎంఎ డాక్టర్లు బృందం నివాళులు అర్పించింది. కదిరి పట్టణంలోని గవర్నమెంట్ హాస్పిటల్ లోని కాన్ఫరెన్స్ హాల్‌లో రవీంద్ర రెడ్డి చిత్రపటానికి కదిరి ఐఎంఏ డాక్టర్లు పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కదిరి ఐఎంఏ బ్రాంచ్ తరపున సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రమణయ్య, శంకరయ్య, శ్రీనివాసులు, నాగేంద్ర కుమార్ రెడ్డి, నాగరాజు, పద్మావతి బాయ్, కదిరి ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఆజాద్, సెక్రటరీ డాక్టర్ జానకి రామ్, ట్రెజరర్ డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన కరాటే విన్యాసాలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణంలోని బాయ్స్ హైస్కూల్ లో కియో జపాన్ షోటో ఖాన్ కరాటే అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఖాద్రి కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మాస్టర్ అక్బర్ అలీ నిర్వహించిన కరాటేబెల్ట్ టెస్ట్ లో విద్యార్థుల విన్యాసాలు అబ్బురపరచాయి. పంచస్ కిక్స్ బ్లాకింగ్స్ సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ నాంచాక్ రొటేషన్ టైల్స్ బ్రేకింగ్ కథస్ నిర్వహించారు. వీరందరికీ ముఖ్య అతిథులుగా విచ్చేసిన టిడిపి నాయకులు బహుద్దీన్ ఇసాక్ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలను, బెల్ట్‌లను అందజేశారు.

సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి రొద్దం

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నలుగురు బాధితులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం పెనుగొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు టైలర్ ఆంజనేయులు, మనోహర్, నాగిరెడ్డి, గోనమేకలపల్లి డీలర్ గంగాధర్, పెద్దకోడపల్లి డీలర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

15 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు

ప్రజాశక్తి - రొద్దం

మండలానికి 15 ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేసినట్లు ట్రాన్స్‌కో ఎఇ శ్రీనివాస్ మూర్తి తెలిపారు. ఆదివారం పెనుగొండలోని విద్యుత్ కార్యాలయంలో మంత్రి సవిత చేతుల మీదుగా రైతులకు అందజేశారన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - కదిరి టౌన్

పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుని బాధ్యతని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ న్యాయాధికారి ఎస్ జయలక్ష్మి పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా మరో న్యాయాధికారి పి లోకనాథంతో పాటు ఆమె ర్యాలీలో పాల్గొన్నారు. కోర్టుల పర్యవేక్షకులు శివారెడ్డి సత్యనారాయణ ఇతర కోర్టుల సిబ్బంది న్యాయవాదులు పాల్గొన్న ఈ ర్యాలీ కోర్టు నుంచి ప్రారంభమై పురవీధుల్లో సాగింది. పర్యావరణాన్ని కాపాడుకోవడానికి వివిధ మార్గాల ద్వారా చైతన్య ర్యాలీలు కార్యక్రమాలు సాగుతున్నాయని న్యాయాధికారి స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థ ద్వారా కూడా ఈ ప్రక్రియ కొనసాగుతోందని అన్నారు. పర్యావరణం పరిరక్షింపబడినప్పుడే ప్రజారోగ్యం కూడా కాపాడబడుతుందని గుర్తుంచుకోవాలన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు.

ప్రిన్సిపల్‌ను ఆదర్శంగా తీసుకోండి

గుడిబండ : గుడిబండ మహాత్మ జ్యోతిరావు పూలే కళాశాల ప్రిన్సిపల్ పోతురాజు ప్రసాద్ ను ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక టిటిడి కళ్యాణమండపంలో ప్రిన్సిపల్ ప్రసాద్ ఉద్యోగవిరమణ సన్మాన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తితో పాటు రాష్ట్రవక్కలిగ చైర్మన్ లక్ష్మీనారాయణ, స్థానిక సింగల్ విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప, మండల కన్వీనర్ లక్ష్మీ నరసప్ప, న్యాయవాది శివకుమార్, రామప్ప, ఎంఇఒ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి మాట్లాడుతూ విధి నిర్వహణలో విశిష్ట సేవలందించి అందరి మన్ననుల పొందిన ప్రసాద్‌ను ఇతర ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వివిధ కళాశాలల, పాఠశాల ఉపాధ్యాయులు, స్థానిక ఎం జె పి కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పిపిపితో పేదలకు ప్రభుత్వ వైద్యం దూరం : వైసిపి



సంతకం చేస్తున్న మహిళలు

ప్రజాశక్తి-సోమందేపల్లి

కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు ప్రభుత్వ వైద్య విద్య ప్రభుత్వ వైద్యం దూరం చేయాలనే కుట్రలో భాగంగానే ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రయివేటు వ్యక్తులకు అంటగడుతోందని వైసిపి పెనుకొండ నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ విమర్శించారు. మండల పరిధిలోని పందిపర్తి గ్రామంలో మండల కన్వీనర్ గజేంద్ర ఆధ్వర్యంలో పిపిపిను వ్యతిరేకిస్తూ వైసిపి ప్రభుత్వం చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో ఉషశ్రీ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పేద ప్రజలకు ఉచిత వైద్యం అందుబాటులో ఉండాలని ఆశయంతో జిల్లాకు ఒక ప్రభుత్వ వైద్యశాల కళాశాల ఉండే విధంగా రాష్ట్రానికి 17 కాలేజీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అప్పటికే 5 కళాశాలలు పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉన్నాయని అయితే కూటమి ప్రభుత్వం ప్రజలకు ప్రభుత్వ వైద్యాన్ని, విద్యను దూరం చేస్తూ కార్పొరేటర్లకు మేలు చేసే విధంగా ప్రభుత్వ ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు పిపిపి విధానాన్ని చేపట్టిందని అన్నారు.పిపిపి విధానాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణలో ప్రతి ఒక్క వైసీపీ కార్యకర్త, పేద ప్రజలు పాల్గొని దిగ్విజయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి టౌన్ కన్వీనర్ గోవిందమ్మ గారి శ్రీనివాసులు, వెంకటరత్నం, జడ్పిటిసి డిసి అశోక్, మాజీ కన్వీనర్ నారాయణరెడ్డి, ఉప సర్పంచి వేణు, హిమాం వలి, వైస్ ఎంపీపీ వెంకట్ నారాయణ రెడ్డి, పృథ్వీ, సర్పంచులు లక్ష్మీ నరసప్ప, కిష్టప్ప, సోమశేఖర్, రామాంజనేయులు, నాయకులు సదాశివరెడ్డి, రవీందర్ రెడ్డి, చాందు, ఎంపీటీసీ బాబు, మహిళా అధ్యక్షురాలు శివమ్మ, చిరంజీవి రాజశేఖర్ రెడ్డి, పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓబుళదేవర చెరువు : వైద్యకళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మండల పరిధిలోని టీ కుంట్లపల్లి, వెంకటాపురం, గాజుకుంటపల్లి, తదితం గ్రామపంచాయతీలలో వైసిపి పుట్టపర్తి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కోటిసంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదాయ మార్గాన్ని ఎంచుకొని పలు కంపెనీలను ఆహ్వానిస్తున్నామని చెప్పుతూ భూములను తక్కువ ధరకు కట్టబెడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ఆదాయం మాట ఎలా ఉన్నా కూటమి ప్రభుత్వ నాయకుల ఆదాయం బాగా మెరుగుపండిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుర్లి దామోదర్ రెడ్డి, లక్ష్మీపతి రెడ్డి, కోళ్ల కృష్ణారెడ్డి, షామీర్ భాష, రాజు నాయుడు గోవిందు బాబా ఫక్రుద్దీన్, వెంకటరమణ ,జగన్మోహన్ చౌదరి, భారతీ సిమెంట్ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నల్లమాడ

మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక నాగలకట్ట వీధిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పలుగ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొందన్నారు. వీధిలైట్లు, సిసి రహదారులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేవారు.ఈ సమావేశంలో సిపిఎం నాయకులు గోవిందు, రాజు, మల్లికార్జున, రామచంద్ర, గంగులప్ప, రమణ, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

నూతన వ్యాయామ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - కొత్తచెరువు

2025 మెగా డీఎస్సీలో సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఎంపికైన వ్యాయామ ఉపాధ్యాయులకు. రాష్ట్ర పీఈటీల సంఘం అధ్యక్షులు అంజన్న, ప్రధాన కార్యదర్శి రామకష్ణ, ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా నూతనంగా 57 మంది వ్యాయామ ఉపాధ్యాయులు ఎంపికై శిక్షణ పూర్తి చేసుకుని విధులకు హాజరయ్యారన్నారు. విధులను అంకితభావంతో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు జయచంద్ర, సోమశేఖర్, పాఠశాల హెచ్ఎం గోపాల్, రిటైర్డ్ ఉపాధ్యాయులు నాగేందర్ ప్రసాద్, హరి ప్రసాద్, పిఇటిలు రవీందర్ నాయక్, శివకుమార్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి

ప్రజాశక్తి - కదిరి టౌన్

కోర్టుల్లో ఉన్న సమస్యలు, న్యాయవాదులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అన్ని పరిశీలనలో ఉన్నాయని త్వరలోనే పరిష్కార మార్గం వస్తుందని జిల్లా ప్రధాన న్యాయాధికారి భీమారావు అన్నారు. కదిరి కోర్టుల పరిశీలన కోసం న్యాయాధికారి కదిరిలో పర్యటించారు. ఆయనకు స్థానిక న్యాయధికారులు ఎస్ జయలక్ష్మి, పి లోకనాథం, కోర్టుల పర్యవేక్షకులు శివారెడ్డి, సత్యనారాయణ సిబ్బంది న్యాయవాదులు స్వాగతం పలికారు. కోర్టు ఆవరణలోనే పోలీసు వందనం కూడా స్వీకరించారు. అనంతరం న్యాయవాదుల సంఘం విజ్ఞప్తి మేరకు సంఘ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను అదనపు కోర్టుల అవసరాన్ని సిబ్బంది కొరత న్యాయాధికారుల నియామకాలు ఇతర సమస్యలను న్యాయాధికారి దృష్టికి తీసుకువచ్చారు. ప్రత్యేకంగా ఏ డి జె కోర్టు అంశాన్ని కూడా ఆయన దృష్టికి తెచ్చారు. ఇప్పటికే అనేక విజ్ఞప్తులు ఉన్నాయని అదనంగా కోర్టుల ఏర్పాటును త్వరలోనే చేయిస్తామని భీమారావు హామీ ఇచ్చారు. ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలి కానీ అనవసరమైన వాటిపై ఆకాశరామన్న ఉత్తరాలు రాసి ఇబ్బందులు కలిగిస్తున్నారని న్యాయవాదులకు చురకలంటించారు. ఈ పద్ధతి మంచిది కాదని కూడా అన్నారు. 'మీ వైపు నుంచి సహకారం ఉన్నప్పుడు ఏ సమస్య అయినా పరిష్కారానికి నోచుకుంటుందని' స్పష్టం చేశారు. జిల్లా న్యాయాధికారిని బార్ అసోసియేషన్ సంఘం అధ్యక్షుడు చౌడప్ప ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి ఖాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి చిత్రపటాలను బహుకరించారు. న్యాయాధికారి వెంట స్థానిక న్యాయాధికారులు ఎస్ జయలక్ష్మి పి లోకనాథం ఉన్నారు. ఈసమావేశంలో ప్రభాకర్ రెడ్డి, రవీంద్రబాబు, లోకేశ్వర్ రెడ్డి, సుబ్బరాజు, గుప్తా, తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జిల్లా న్యాయధికారిని స్థానిక ఆర్డీవో వివిఎస్ శర్మ, తహశీల్దార్ మురళీకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు.